క్లుప్తంగా

గోరింటాకు సంబరాలు



గోరింటాకు చూపుతున్న మహిళలు

ఆదిలాబాద్‌రూరల్: ఆషాఢమాన్ని పురస్కరించుకుని స్థానిక మున్నూర్‌కాపు మహిళా సంఘం ఆధ్వర్యంలో గోరింటాకు సంబరాలు జరుపుకున్నారు. పెళ్లికాని యువతుల గోరింటాకు ఎర్రగా పండితే వారికి మంచి గుణాలను కలిగిన వరుడు వస్తాడని, అదేవిధంగా పెళ్లైన వారి చేతులు ఎర్రగా పండితే సౌభాగ్యంగా భావించడం జరుగుతుందని అధ్యక్షురాలు ప్రభావతి, ప్రధాన కార్యదర్శి జోగు రమణి, కోశాధికారి గంట స్వన్న పేర్కొన్నారు. ముందుగా గౌరీ దేవికి పూజలు నిర్వహించి, అనంతరం గోరింటాకు పెట్టుకుని ఆటపాటలతో సందడి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నార్నూర్: మండల కేంద్రంలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలను శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌లో నిర్వహించారు. ఆదిలాబాద్ పట్టణంలోని హమాలీవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 30 ఏళ్లు పైబడిన వారందరికీ నమూన పరీక్షలు చేశారు. బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి కార్డులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బండారి సతీష్, వైద్యాధికారి అవినాష్, రణిత పాల్గొన్నారు.

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

బజార్‌హత్నూర్: మండలంలోని 64 అంగన్‌వాడీ కేంద్రాలు, ఉప కేంద్రాల పరిధిలో సూపర్‌వైజర్ పద్మ ఆధ్వర్యంలో అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో కొనసాగుతోంది. శుక్రవారం పిప్రి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పద్మ మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని పిల్లల తల్లితండ్రులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుగుణ, గంగోలి, ఆయా గంగుబాయి, ఆశ వర్కర్, ఏఎన్ఎం, తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

తలమడుగు: గిరిజన రైతులను ఆసరాగా చేసుకొని నకిలీ మందులు విక్రయించే ఫర్టిలైజర్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ తుడుందెబ్బ ప్రధాన కార్యదర్శి కొమ్రం జ్ఞానేశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని పల్సి(కె) గ్రామానికి చెందిన రైతు సీడం విశాల్ 9 ఎకరాలలో పత్తి పంట వేయగా.. గడ్డి ఎక్కువ కావడంతో ఓ ఫర్టిలైజర్ దుకాణంలో గడ్డి మందు కొనుగోలు చేసి, పిచికారీ చేయడం పత్తి పూర్తిగా ఎండిపోవడం జరిగిందన్నారు. నకిలీ మందు విక్రయించే దుకాణ యజమానిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

కుమురంభీం జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: మండలంలోని నర్సాపూర్ చౌక్ వద్ద కుమురం భీం స్మారక జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. నర్సాపూర్, సాకెర, పెందుర్‌గూడ, ఆడగూడ ఆదివాసీ సంఘాల నాయకులు ముందుగా ప్రత్యేక పూజలు చేసి, జెండా ఆవిష్కరించారు. ఆయా గ్రామాల పెద్దలు మెస్రం నాగ్‌నాథ్, భీంరావ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

జైనథ్: మండలంలోని కాన్పమేడిగూడ- ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న భవనీ ఆనంద్, పెంటపర్తి ఊశన్న, కన్నల భూమయ్య ఉపాధ్యాయులను గ్రామస్తులు, విద్యార్థులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పూలమాలలు, శాలు వాలతో సత్కరించారు.

పశువులు పైలం



పశువులకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న వైద్యులు

- వర్షాకాలంలో మూగజీవాలకు పొంచి ఉన్న ముప్పు
- అప్రమత్తంగా ఉండాలంటున్న రైతులు

తలమడుగు: వర్షాకాలం వ్యాధుల కాలం.. మూగజీవాలకు గొంతువాపు, జబ్బువాపు, లాంటి వ్యాధులు సోకుతాయి. రైతులు సకాలంలో తగిన యాజమాన్య పద్ధతులు పాటించి వైద్యచికిత్స చేయించాలని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువులు బలహీనంగా ఉంటాయి. పాడి పశువులు నీరసంగా ఉంటాయి. పాల ఉత్పత్తి తగ్గుతుంది. వ్యవసాయ పనులు చేయడానికి ఎద్దులు సహకరించవు. సంకరజాతితోపాటు షెడ్లలో పెంచుకునే పశువులకు ఈ వ్యాధి సక్రమిస్తుంది. మార్చి, ఏప్రిల్, సెప్టెంబర్, అక్టోబర్‌లో ఈ రోగాలు చుట్టుముట్టే ప్రమాదం ఉంది. వ్యాధి సోకిన పశువులకు నోటిగిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి. మూడు, నాలుగు వారాల్లో అవి పగిలి పుండ్లుగా మారుతాయి. చర్మం గరుకుగా మారుతుంది. నోటిపై చిగుళ్లపై పొక్కులు ఏర్పడడం వాటి ద్వారా మేత మేకపోవడం నిరసించిపోతాయి.

జబ్బువాపు వ్యాధి

తెల్లజాతి పశువుల్లో జబ్బ వాపు వ్యాధి కనిపిస్తుంది. వ్యాధి సోకిన పశువులు అధిక జ్వరంతో బాధపడుతుంటాయి. మేత మేయకుండా పడుకునే ఉంటయి. జబ్బ భాగం వాచి నల్లగా కనబడుతుంది. అక్కడ కండరాలు ఉబ్బుపోతాయి. వాటిలో గాలిబడగలు నీరు చేరి పశువులు తీవ్ర నొప్పితో బాధపడుతాయి. వాచిన చోట చేతితో తాకితే గరగరమని శబ్దం వస్తుంది. సకాలంలో వైద్యం అందించకపోతే చనిపోయే ప్రమాదం ఉంటుంది. వ్యాధిని గమనించి సకాలంలో ఇంజక్షన్ గ్లూకోజ్ ద్రవణాన్ని అందించాలి. ముందస్తుగా టీకాలు వేయాలి.

గొర్రెల్లో కాలిపుండ్లు..

గొర్రెలు బురదలో తిరగడం వల్ల కాలిపుండ్లు వ్యాధి వ్యాపిస్తుంది. గిట్టల మధ్య చర్మం మెత్తబడి వాచి చిట్లుతుంది. చీము పట్టి నొప్పితో ముందు కాళ్లపై గెంటుతుంటాయి. వ్యాధి ముదిరితే గిట్టలు ఊడిపోతాయి. వ్యాధి సోకిన జీవాలకు 10 శాతం మైలతుత్తం, 10 శాతం జింక్‌సల్ఫేట్, లేదంటే 5 శాతం ఫార్మలిన్‌లో ఏదైనా ఒక ఆయింట్‌మెంట్ పూయాలి. యాంటిబయాటిక్ ఇంజక్షన్లు వరుసగా 3–5 రోజులు వేయించాలి.

గొంతువాపు సోకితే..

పశువులకు సోకే ప్రాణాంతక వ్యాధుల్లో గొంతువాపు (గురక) ఒకటి. ముఖ్యంగా వయసులో ఉన్న గేదెజాతి పశువుల్లో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వ్యాధి సోకి జ్వరం వస్తుంది. మేత మేయవు. గొంతుపై, మెడ కింద వాపు కనిపిస్తుంది. పశువు ఆయాసపడుతూ శ్వాస తీసుకుంటుంది. ఆ సమయంలో గురక శబ్దం వస్తుంది. నోరు ముక్కు నుంచి ద్రవం కారుతుంది. పశువు వణుకుతూ ఉంటుంది. కళ్ల వెంట నీరు కారుతుంది. పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుంది. వ్యాధి తీవ్రత ఎక్కువగా అయితే పశువు ఎడతెరిపి లేకుండా దగ్గుతూ, చివరకు అపస్మారకస్థితిలో వెళ్లి చనిపోతాయి.

లేత గడ్డి ప్రమాదమే..

తొలకరి వర్షాలకు మొలిచే లేతగడ్డి మొక్కలను పశువులు అతిగా తింటుంటాయి. అయితే ఎదిగి ఎదగని లేత గడ్డిలో హైడ్రోస్రైనైడ్ విషపదార్థం ఉంటుంది. ఇలాంటి గ్రాసాన్ని మేసిన 15 నిమిషాలకే పశువుల్లో వ్యాధి లక్షణాలు బయటపడుతాయి. వెంటనే తగిన చికిత్స చేయించకపోతే పశువు మృత్యువాత పడే ప్రమాదం ఉంది. రైతులు పశువులకు లేత గడ్డిని తినిపించకుడదు.

పశు వైద్యశిబిరాలు ఏర్పాటు

మండలంలో 28 పంచాయతీల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. పశువులకు గాలికుంటు, ఇతర వ్యాధి టీకా వేస్తాం. పశువులకు ఎలాంటి వ్యాధి సోకిన వైద్య సిబ్బంది వద్దకు తీసుకువస్తే చికిత్స చేస్తారు.

– దూద్‌రామ్ రాథోడ్, పశువైద్యాధికారి

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి వెంకట రమణ

తాంసి: గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి వెంకట రమణ అన్నారు. శుక్రవారం మండలంలోని పొన్నారి గ్రామంలో ఎంపీడీవో మోహన్ రెడ్డితో కలిసి సందర్శించారు. మురికి కాలువలు, పరిసరాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. చెత్తను తొలగించడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి విజయ్, అంగన్‌వాడీ కార్యకర్తలు దేవమ్మ, గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇంద్రవెల్లి మేజర్ గ్రామపంచాయతీ ఈవో సంజీవ్‌రావు అన్నారు. శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మండల కేంద్రంలోని భీంనగర్, బుద్ధనగర్, ప్రబుద్ధనగర్ కాలనీకి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన మురుగు నీటిని తొలగించారు. వర్షకాలంలో విషజ్వరాలు ప్రబల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. పారిశుధ్య పనులు నిర్వహణలో ప్రజలు గ్రామపంచాయతీ అధికారులకు సహకరించాలని కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న యశోద

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళ సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ యశోద అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గెజిటెడ్ నెం.1 పాఠశాలలో మహిళ సాధికారత, సఖీ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బేటీ బచావో.. బేటీ పడావో, మిషన్ శక్తి పథకం, అంటు వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జిల్లా మహిళ సాధికారత కేంద్రం గురించి వివరించారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం కేసు వర్కర్ నాగమణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని న్యాయవాది ధమ్మపాల్, విజయ్‌లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాలల హక్కులు, విద్యాహక్కు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నారాయణ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పురాతన నాణేల ప్రదర్శన



నాణేల గురించి వివరిస్తున్న రాజ్‌కుమార్

బోథ్: సొనాల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐహెచ్‌ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ పురాతన నాణేల గురించి శుక్రవారం విద్యార్థులకు వివరించారు. 1905, 1910, బ్రిటీష్ కాలం నాటి నాణేలు, మొఘల్ పాలకుడు అక్బర్ నాటి రాగి నాణేలు, షాజహాన్ కాలం నాటి నాణేలను ప్రదర్శించారు. వాటి చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీతావాణి, శ్రావణి, నర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

స్నేహితుడిని పరామర్శించిన మాజీ మంత్రి

జైనథ్: ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దీపాయిగూడ గ్రామానికి చెందిన తన స్నేహితుడు జీవన్‌రెడ్డిని మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. శుక్రవారం దీపాయిగూడ గ్రామస్తులు, నాయకులతో కలిసి నిజామాబాద్ వెళ్లిన ఆయన, పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ బొల్లి గంగన్న, ఇతర నాయకులు ఉన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 44 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధి పాటుపడుతుందన్నారు. త్వరలో లక్షల రూపాయలతో పాటు తులం బంగారం అందజేస్తామన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖయ్యుం, అజీం, ఎక్బాల్, జగదీశ్, జుబేర్, సునీల్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం కేబీ ప్రాంగణంలోని స్పోర్ట్స్ పాఠశాల, ఐటీఐ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్య, వైద్య, భోజన వసతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో పాటు క్యూలో నిలబడి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అధికారం కోసం అమలుకాని హామీలు

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ: సీఎం రేవంత్ రెడ్డి అధికారం కోసం అమలు కాని హామీలు ఇచ్చారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 26 మంది లబ్ధిదారులకు రూ.1,00,116 చొప్పున మొత్తం రూ. 26,03,016 లక్షల చెక్కులు అందజేశారు. అలాగే బోథ్ మండలానికి చెందిన ఇద్దరికి రూ.33వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నానక్ సింగ్, కృష్ణా రెడ్డి, రవీందర్ రెడ్డి, సురేందర్, గులాబ్, పండరీ, పాండురంగ్, ప్రతాప్, తిత్రే మెర్సింగ్, ప్రదీప్ పాల్గొన్నారు.

పాఠశాల రుణం తీర్చుకునే అవకాశం దొరకడం అదృష్టం

ఇచ్చోడ: చదువుకున్న పాఠశాల రుణం తీర్చుకునే అవకాశం దొరకం అదృష్టంగా భావిస్తున్నానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీపాఠశాల ఆవరణలో మొక్కలు నాటి డ్రీమ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సైన్స్‌కిట్లు పంపిణీ చేశారు. ఇదే పాఠశాలలో రెండు నుంచి పదో తరగతి వరకు చదువుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడ లేని విధంగా 12 వందల మంది విద్యార్థులు, 52 మంది ఉపాధ్యాయులతో కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రీమ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కృష్ణా రెడ్డి, ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేశ్‌జోషి, ఎఫ్ఆర్‌వో పుండలిక్, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో శీలనంద్, శ్రీకాంత్‌రెడ్డి, గాడ్గే సుభాష్, లోక శిరీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చాలి



వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ కులస్తులు

తాంసి: అత్యంత వెనుకబడిన ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చాలని ముదిరాజ్ సంఘ రాష్ట్ర కార్యదర్శి సలేంద్ర శివ్వయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ విష్ణు జాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ వ్యాప్తంగా 10 శాతం ఉన్న ముదిరాజ్‌లు పేదరికంలో జీవిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ, మండల అధ్యక్షుడు గుగ్గిళ్ల పొచ్చన్న, నాయకులు దారవేణి రాఘవేంద్ర, రమాకాంత్, స్వామి, రాకేశ్, వెంకట్, సాయి పాల్గొన్నారు.

బోథ్: ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలో చేర్చాలని ముదిరాజ్ సంఘం నాయకులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. తమ కులాన్ని అప్పటి సీఎం రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన జీవో 17 యథావిధిగా అమలయ్యేలా చూడాలన్నారు. ముదిరాజ్‌లకు ఒక ఎమ్మెల్సీతో పాటు రాజ్యసభ పదవి, 10 కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు జుంగాల భోజన్న, ప్రధాన కార్యదర్శి నాయడు శ్రీనివాస్, మహిపాల్, సున్నపు శ్రీనివాస్, మెందు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

‘సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి’



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. పారిశుధ్య రెగ్యులర్ కార్మికుల ఖాళీలను ఔట్‌సోర్సింగ్ కార్మికులతో భర్తీ చేయాలన్నారు. ప్రతీ నెలా 5వ తేదీలోపు వేతనాలను చెల్లించాలని, ప్రతీ మూడు నెలకొసారి కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేయాలని కోరారు. ప్రతీ ఏడాది నూనెలు, సబ్బులు, బెల్లం, చెప్పులు, యూనిఫాం, అప్రాన్‌ను ఇవ్వడంతో పాటు వర్షాకాలంలో రెయిన్ కోట్‌లను అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సిర్ర దేవేందర్, నారాయణ రెడ్డి, చంద్ర శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై విచారణ చేయాలి



మాట్లాడుతున్న కొట్టురి ప్రవీణ్‌కుమార్

ఇచ్చోడ: ఇచ్చోడ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను తరలించిన అధికారులపై విచారణ చేయాలని టీజీబీవీ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రెటరీ కొట్టురి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇచ్చోడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అద్దె భవనంలో ఉన్నప్పటికీ విద్యార్థులకు దూరభారం కాకుండా మెరుగైన వసతులతో ఉన్న కళాశాలను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎలాంటి వసతులు లేని భవనంలోకి ఎందుకు మార్చాల్సి వచ్చిందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్, కొంత మంది సిబ్బంది వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఆదిలాబాద్‌కు తరలించారని ఆరోపించారు. కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ కన్వీనర్ గొర్ల నరేందర్ యాదవ్, కో కన్వీనర్ ఉల్లెంగుల సతీష్, గణేష్, రాజు పాల్గొన్నారు.

‘మితిమీరిన ఆగడాలతోనే గద్దె దించారు’



మాట్లాడుతున్న సలీం

ఎదులాపురం: మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ అవినీతి, ఆగడాలు మితిమీరి పోవడంతోనే అవిశ్వాసంతో ఆయనను గద్దించారని బీఆర్ఎస్ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు సలీం అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. వైస్ చైర్మన్ అవిశ్వాసం కోసం కాంగ్రెస్ కౌన్సిలర్లు సైతం సంతకాలు చేసిన విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని హితవు పలికారు. రౌడీయిజం, అవినీతి, అక్రమాలు పెరగడమే ఇందుకు కారణమన్నారు. ఇకనైనా ఇలాంటి వ్యాఖ్యలు మానుకోవాలన్నారు. కౌన్సిలర్ ఇమ్రాన్, మోబిన్, సలీం, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

జైనథ్: మండలంలోని గూడ గ్రామంలో గిమ్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో, బెల్గాం గ్రామంలో జైనథ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. అంతకు ముందు గ్రామాలో డ్రైడే.. ఫ్రైడే నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్లు సుచల, నైనత మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, అనంతరం మందులు పంపిణీ చేశారు.

‘రుణమాఫీ రేవంత్ సర్కార్‌కే సాధ్యం’



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కంది శ్రీనివాస రెడ్డి, రైతులు

బేల: ఒకేసారి 31 వేల కోట్ల రుణమాఫీ చేయడం చరిత్రలో మొదటిసారని, ఇది రేవంత్‌రెడ్డి సర్కార్‌కే సాధ్యమైందని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు చప్రాల గ్రామంలో సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులు, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతతో సుమారు రూ. 7 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేసి వారి ముఖాల్లో సంతోషాలు నింపారన్నారు. రైతు పక్షపాతి ప్రభుత్వంగా..రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గిమ్మ సంతోష్, బాయిన్‌వార్ గంగారెడ్డి, షకీల్, అల్లూరి అశోక్ రెడ్డి, గడ్డం జగదీష్ రెడ్డి, పోరెడ్డి కిషన్, ఫైజుల్లా ఖాన్, రాందాస్ నాక్లే, సామ రూపేష్ రెడ్డి, సంజయ్ గుండావార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని 12వ వార్డు న్యూ హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన మహాకాల్ సేన అధ్యక్షుడు అజయ్‌తో పాటు 8, 12వ వార్డుకు చెందిన పలువురు కాలనీవాసులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

‘ఇచ్చిన మాటకు కట్టుబడినం’

తలమడుగు: ఎన్నికలో రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి రుణమాఫీ చేశామని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి అడే గజేందర్, మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కజ్జర్ల గ్రామంలో, తలమడుగు మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల్లో మేనిఫెస్టోలో భాగంగా రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కల్యాణం రాజేశ్వర్, జైభరత్ రెడ్డి, తిరుపతి, రఫీ, పోశెట్టి, ప్రకాశ్‌రావు, శ్రీనివాస్, నారాయణ, దేవన్న, లింగన్న పాల్గొన్నారు

ఆర్ఎంపీల క్షీరాభిషేకం

బేల: మండల కేంద్రంలోని స్థానిక శివాజీ కూడలి వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం టపాసులు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు వైద్య విట్టల్, సుభాష్ ఊరడే, రూపేష్ బన్కర్, దేవిదాస్, సూర్యకాంత్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు వివరిస్తున్న స్థానికులు

గుడిహత్నూర్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో పర్యటించిన ఆయనకు స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన చేపట్టాల్సి అభివృద్ధి పనుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ ఆడే శీల, పార్టీ మండలాధ్యక్షుడు మల్యాల కరుణాకర్, కరాడ్ బ్రహ్మానంద్, జలందర్, షాహీద్ తదితరులున్నారు.